సమస్యల పరిష్కారమే ధ్యేయం


సమస్యలపై ఫోన్‌లో అధికారులతో మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శుక్రవారం షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో నియోజకవర్గ పరిధిలోని పలు బస్తీలు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అభివృద్ధి పనులను వేగవంతం చేసి మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలి


గర్భిణులు, బాలింతలకు సూచనలు ఇస్తున్న సీడీపీఓ రేణుక

రంగారెడ్డినగర్: బాలింతలు, గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకుంటే పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని సీడీపీఓ రేణుక అన్నారు. 'పోషణ్ మహా ప్రోగ్రామ్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కుత్బుల్లాపూర్ ప్రాజెక్ట్ రంగారెడ్డినగర్ సెక్టార్, ఇందిరా గాంధీనగర్-1, 2, గుడెన్ మెట్ అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గర్భిణులకు సీమంతాలను సెక్టార్ సూపర్‌వైజర్ జె.జ్యోతితో కలిసి ఆమె చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో తప్పక చేర్పించాలని, వారి సంరక్షకులుగా కేంద్రాలు నిరంతరం పని చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, సుజాత, శిల్ప, చిన్నారుల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథా.. తాగునీటి కటకట

- కొన్ని రోజులు పైప్‌లైన్ లీకేజీ
- పట్టించుకోని అధికారులు


ఇందిరాగాంధీ నగర్ సమీపంలో వాల్వ్ నుంచి రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు

చింతల్: ఓవైపు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటుంటే మరోవైపు తాగునీటి వృథా నిత్యం జరుగుతూనే ఉంది. కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ పరిధిలోని ఆయా సెక్షన్ల పరిధిలో వారానికి ఒకసారి తాగునీటిని సరఫరా చేస్తుండగా కొన్ని సెక్షన్లలో రోజు విడిచి రోజు, రెండు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో వారం రోజులకోసారి నీటిని సరఫరా చేసే ప్రాంతాల్లో నీటి కొరత ఏర్పడుతుంటే అధికారుల నిర్లక్ష్యం వల్ల మరోవైపు వందలాది కిలోమీటర్ల నుంచి తీసుకు వచ్చిన తాగునీరు లీకేజీల రూపంతో నిత్యం రోడ్లపై పారుతోంది. లీకేజీలను అరికట్టి తాగునీటి ఎద్దడి నివారించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆదర్శనగర్ సెక్షన్ పరిధిలోని బాలనగర్ పైప్‌లైన్ నుంచి ఇందిరా గాంధీనగర్ ఏటుఏ సెంట్రల్ అపార్ట్‌మెంట్స్‌కు వెళ్లే పైప్‌లైన్‌కు ఉన్న వాల్వ్ లీకేజీ ఏర్పడి కొన్ని రోజులుగా నీరు ప్రధాన రోడ్డుపై పారుతోంది. ఈ సరఫరా ఎక్కువ సమయం కొనసాగుతూ ఉండటంతో నీరు వృథాగా పోతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే జలమండలి అధికారులు స్పందించి నీటి లీకేజీలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బీఆర్ఎస్ శ్రేణుల అరెస్ట్


పోలీసుల అదుపులో కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు

కూకట్‌పల్లి: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ నివాసానికి ర్యాలీగా వెళ్లి సమావేశం నిర్వహిస్తామని బీఆర్ఎస్ నేతలు ప్రకటించారు. ఈ క్రమంలో శుక్రవారం పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి నాయకులు, కార్యకర్తలతో బయలుదేరిన వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావును పోలీసులు అదుపులోకి తీసుకొని అల్లాపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గాంధీ ఏ పార్టీలో ఉన్నారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. అరెస్టులు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, నాయకులు ఆంజనేయులు, సతీష్, కొండల్‌రావు, మాధవి, తార, విక్రమ్, జగన్, కిరణ్, మధు, ప్రవీణ్, రవి, హరీష్, నవీన్, చేతన్, సంతోష్, విష్ణు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్ నిర్మాణాలపై చర్యలెప్పుడో?

- హైడ్రా జాబితాలో దూలపల్లి చెరువులు
- లింగయ్య, తుమార్ చెరువు పరిధిలో యథేచ్ఛగా నిర్మాణాలు
- ఇటీవలే పరిశీలించిన హైడ్రా కమిషనర్


దూలపల్లిలో ఫాక్స్‌సాగర్ కట్టుకాలువ పక్కనే నిర్మాణాలు


సుభాష్‌నగర్: చెరువులు, కుంటలు, కాల్వల ఆక్రమణలపై ఇప్పటికే నగర వ్యాప్తంగా హైడ్రా హడలెత్తిస్తోంది. నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ స్థలాల్లో వెలసిన నిర్మాణాల జాబితాలో కొంపల్లి మున్సిపల్ దూలపల్లిని పేర్కొన్నారు. దూలపల్లిలోని చెరువుల ఎఫ్‌టీఎల్, కట్టు కాలువను కబ్జా చేసి గతంలో జోరుగా నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం నిత్యం ఏదో ఒకచోట హైడ్రా ఆధ్వర్యంలో కూల్చివేతలు జరుగుతుండటంతో స్థానికంగా ఎఫ్‌టీఎల్ స్థలంలో నిర్మాణాలు చేపట్టిన వారి గుండెల్లో గుబులు మొదలైంది. హైడ్రా అధికారులు ఇటువైపు ఎప్పుడు వస్తారు.. ఈ నిర్మాణాలపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారో అని స్థానికులు ఎదురు చూస్తున్నారు.

6 ఎకరాల ఎఫ్‌టీఎల్ స్థలం పూడ్చివేత

తుమార్ చెరువు 13 ఎకరాల 21 గుంటల విస్తీర్ణంలో ఉంది. ప్రస్తుతం 6 ఎకరాలకు పైగా ఎఫ్‌టీఎల్ స్థలాన్ని పూడ్చివేశారు. దిగువ భాగాన లింగయ్య చెరువును కలిపే కట్టు కాలువను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారు. ఈ విషయమై జూన్‌లో సాక్షి వరస కథనాలు ఇవ్వడంతో అధికార యంత్రాంగం కదిలివచ్చి నిర్మాణాలను తొలగించింది.

లింగయ్య చెరువు..

తుమార్ చెరువు దిగువ భాగాన లింగయ్య చెరువు సర్వే నెంబర్ 21 లో 20 ఎకరాల 14 గుంటల విస్తీర్ణంలో ఉంది. చెరువును అనుకుని ఉన్న సర్వే నెంబర్ 19, 20 ఎఫ్‌టీఎల్ జోన్‌లో 5 సంవత్సరాల క్రితం అనధికారికంగా వెంచర్ చేశారు. ఆ సర్వే నెంబర్ గుండా గ్రామం నుంచి వచ్చే ఒక కాల్వను సైతం పూడ్చి వేశారు.


చెరువు ఎఫ్‌టీఎల్ మ్యాప్

వెంచర్‌పై ముందు అభ్యంతరం

ఎఫ్‌టీఎల్ స్థలంలో వెంచర్ చేయడంపై అప్పటి రెవెన్యూ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ పనులు నిలిపి వేశారు. తదనంతరం తిరిగి వెంచర్ పనులు పూర్తి చేశారు. ఈ అనధికార వెంచర్‌లో ఓ రెవెన్యూ అధికారికి ఒక ప్లాటు ముట్ట చెప్పినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఇక్కడ 10 నిర్మాణాలు వెలిశాయి.

ఫాక్స్‌సాగర్ ప్రధాన కట్టు కాలువ..

దూలపల్లిలో ఫాక్స్‌సాగర్ చెరువు కొంత భాగం ఆనుకుని ఉంది. అంతేకాకుండా ఫాక్స్ ఆర్‌కు వెళ్లే ప్రధాన కట్టు కాలువ దూలపల్లిలోని తుమార్ చెరువు, లింగయ్య చెరువు మీదుగా వెళ్తుంది. 30 ఫీట్ల వెడల్పు ఉన్న కట్టు కాలువ ఇరుపక్కలా చాలా మంది జరిగి నిర్మాణాలు చేపట్టారు. ఇటీవల ఫాక్స్ సాగర్‌ను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఎగువ ప్రాంతాలైన లింగయ్య చెరువు, తుమార్ చెరువు ఎఫ్‌టీఎల్ స్థలాలను పరిశీలించి వాటిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


దూలపల్లి లింగయ్య చెరువు ఎఫ్‌టీఎల్‌లో చేపట్టిన నిర్మాణాలు

చర్యలు చేపడతాం

గతంలో తుమార్ చెరువు దిగువ భాగాన కట్టుకలువపై వెలసిన నిర్మాణాలను తొలగించాం. కొన్ని నిర్మాణాలు పాతవే. ప్రస్తుతం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఏమైనా నిర్మాణాలు చేపడితే చర్యలు చేపడతాం. తక్షణమే ఏఈని అక్కడికి పంపిస్తా. – శ్రీనివాస్, ఇరిగేషన్ డీఈ

సీతారాం ఏచూరి మరణం తీరనిలోటు


సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కుత్బుల్లాపూర్: సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం వామపక్ష ఉద్యమాలకు, దేశానికి తీరని లోటని సీపీఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం షాపూర్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎమర్జెన్సీ విధించిన సమయంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీని వైస్ చాన్సలర్‌గా ఉండొద్దని విద్యార్థి నేతగా ప్రశ్నించిన యోధుడు ఏచూరి అని, ఎస్ఎఫ్ఐ, సీపీఎం జాతీయ రాజకీయాల్లో దేశ సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటుకు బీజం వేసిన మహోన్నత వ్యక్తి అని స్మరించుకున్నారు. కార్యక్రమంలో దేవదానం, స్వాతి, శ్రీనివాస్, రమణ, వెంకన్న, సైదులు, మైసయ్య, మల్లారెడ్డి, శ్రీశైలం, యాదవరెడి తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్: వామపక్ష మేధావి, కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం నాయకులు అన్నారు. శుక్రవారం ప్రగతినగర్ సుందరయ్య భవన్‌లో సీపీఎం జాతీయ కార్యదర్శి ఏచూరి చిత్రపటానికి నాయకులు పూల మాలేసి నివాళులర్పించారు. ఏచూరి విద్యార్థి దశ నుంచే వామపక్ష, ప్రజాతంత్ర, విద్యార్థి ఉద్యమాలను నిర్మించారని స్మరించుకున్నారు. విద్యార్థి దశలోనే ఎమర్జెన్సీ కాలంలో ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటంలో కేంద్ర ప్రభుత్వ నిర్బంధాలకు ఎదురు నిలిచి జైలు జీవితం అనుభవించారన్నారు. కార్యక్రమంలో వెంకటరామయ్య, చంద్రశేఖర్, బాల వెంకటేశ్వరరావు, మల్లయ్య చారి, సోమిరెడ్డి, వెంకటరాజం, బాలు, భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


విద్యార్థులు, తల్లిదండ్రులకు హెల్మెట్లు అందజేస్తున్న దృశ్యం

దుండిగల్: వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జీడిమెట్ల ట్రాఫిక్ ఎస్ఐ సందీప్ అన్నారు. గండిమైసమ్మలోని శ్రీ శ్లోక పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులకు శుక్రవారం హెల్మెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రాక్స్ ఎన్జీవో ప్రాజెక్టు మేనేజర్ రాజేష్ నమికర్, పాఠశాల ప్రిన్సిపాల్ ఫౌజియా, మేనేజింగ్ డైరెక్టర్ కుకుడాల ఆంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సు ప్రారంభం


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

దుండిగల్: దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాలలో సస్టెయినబుల్ ఎనర్జీ, మెటీరియల్స్, మాన్యుఫ్యాక్చరింగ్ టెక్నాలజీపై అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. రెండు రోజుల పాటు జరుగనున్న ఈ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. 380కి పైగా పరిశోధనా పత్రాలు సమర్పించగా.. వాటిలో 250 సమీక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్‌రావు, ఎం.వెంకటేశ్వర్‌రెడ్డి, ఎం.సత్యనారాయణ గుప్తా, బలరామ్ యెలమశెట్టి, బిట్స్ పిలానీకి చెందిన డాక్టర్ అమిత్ కుమార్ గుప్తా, డాక్టర్ జయప్రకాష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

దాయక సత్యనారాయణకు ఓయూ డాక్టరేట్



రంగారెడ్డినగర్: క్యాపిటల్ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు, చైర్మన్ దాయక సత్యనారాయణకు ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగంలో డాక్టరేట్ లభించింది. ఓయూ ప్రొఫెసర్ ఎ.ప్యాట్రిక్ పర్యవేక్షణలో 'చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలకు ఆర్థిక తోడ్పాటు అందించటంలో రాష్ట్ర ఆర్థిక సంస్థ యొక్క పనితీరు' అనే అంశంపై సత్యనారాయణ సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ పట్టాను పొందారు. డాక్టరేట్ అందుకున్న దాయక సత్యనారాయణను ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం.గంగాధర్, డీన్ డి.చెన్నప్ప, చైర్ పర్సన్ ప్రొఫెసర్ కృష్ణ చైతన్య, ప్రొఫెసర్ ఎ.ప్యాట్రిక్, ప్రొఫెసర్ నవీన్ రెడ్డి, ప్రొఫెసర్ జె.రవి, క్యాపిటల్ విద్యా సంస్థల అధ్యాపక బృందం, విద్యార్థులు అభినందించారు.

మురుగు సమస్యకు పరిష్కారమేది?



జీడిమెట్ల: రోడ్డుపై మురుగునీరు పారకుండా శాశ్వత పరిష్కారం చూపాలని సుభాష్‌నగర్ ప్రజలు కోరుతున్నారు. సుభాష్‌నగర్ లాస్ట్ బస్టాప్ నుంచి పైపులైన్ రోడ్డు వెళ్లే రోడ్డులో ప్రతినిత్యం రోడ్డుపై మురుగు నీరు పారుతుంది. దీంతో రోడ్డు పక్కల ఉన్న ఇళ్లల్లోకి తీవ్రమైన దుర్వాసన రావడంతో నివాసితులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో వేసిన యూజీడీ పైపులైన్ సామర్థ్యం సరిపోకపోవడంతో తరచూ మురుగు నీరు మ్యాన్‌హోళ్ల నుంచి బయటకు పొంగుతుందని కాలనీ వాసులు తెలిపారు. ఇప్పటికైనా కుత్బుల్లాపూర్ సర్కిల్ అధికారులు మురుగునీటి సమస్యకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

చికిత్స కోసం చిన్నారికి ఆర్థికసాయం

మోతీనగర్: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మానవ ధర్మమని వీర లింగేశ్వర సేన కురుమ సంఘం ప్రతినిధులు అన్నారు. బంజారాహిల్స్ శ్రీరామ్‌నగర్‌కు చెందిన గడ్డమీది నరేందర్, కీర్తి దంపతుల కుమారుడు బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో తండ్రి గతంలో మృతి చెందాడు. తల్లి కుమారుడిని పోషించుకుంటూ జీవనం సాగిస్తుంది. చిన్నారి మిథున్ (4) బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న కురుమ సంఘం ప్రతినిధులు ఆసుపత్రి వైద్యం కోసం రూ.1.66 లక్షలను సేకరించి శుక్రవారం చిన్నారి మిథున్ కుటుంబ సభ్యులకు అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో శనివారం సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని నిజాంపేట్ ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

11కేవీ భవ్యాస్ ఫీడర్ నంచి 11కేవీ వెంకటసాయి ఫీడర్ పరిధిలో నూతన కేవీ లైన్ పనుల నేపథ్యంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రామభద్ర ఎన్‌క్లేవ్, నయారా పెట్రోల్ బంక్, హైరైజ్ ఫేజ్-1, భవ్యాస్ ఆనందం, వెంకటసాయి అపార్ట్‌మెంట్స్, బాటాషోరూం, ఈశ్వర్ విల్లాస్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

బాచుపల్లి సెక్షన్ పరిధిలో..

డీసీడబ్ల్యూ పనుల సందర్భంగా 11కేవీ జీపీఆర్ లేఅవుట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1:30 నుంచి 2 గంటల వరకు జీపీఆర్ లేఅవుట్, ఐపీడీఎల్ కాలనీ ప్రాంతాల్లో సరఫరా ఉందని బాచుపల్లి ఏఈ శాంతకుమార్ తెలిపారు.

బౌరంపేట్ సెక్షన్‌లో..

11కేవీ కేవీఆర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రణీత్ నేచర్ బౌంటీ, కేవీఆర్ కాలనీ, స్ప్రింగ్ ఉడ్స్, స్టెర్లింగ్ హోమ్స్, శంభీపూర్ గ్రామం. 11కేవీ బాలాజీ ఎన్‌క్లేవ్ కేబుల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1 నుంచి 1:30 గంటల వరకు బాలాజీ వెంచర్, ప్రణీత్ జెమ్స్, కోటక్ కన్‌స్ట్రక్షన్స్, కేవీఆర్ కన్‌స్ట్రక్షన్స్ ప్రాంతాల్లో, 11కేవీ లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు లక్ష్మీనగర్, సూరారం గ్రామం, అయ్యప్ప సొసైటీ, 11కేవీ కోకకోలా ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11:30 గంటల వరకు డీఆర్‌కే ఇంజినీరింగ్ కాలేజీ, కేఎల్ యూనివర్సిటీ, డాలర్ డ్రీమ్స్, సింహపురి కాలనీ, గోకుల్ బృందావన్, 11కేవీ బౌరంపేట్ కేబుల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 12:30 గంటల వరకు బౌరంపేట్ గ్రామం, ప్రణీత్ బ్లూమ్స్, అక్షయ డెవలపర్స్ ప్రాంతాల్లో సరఫరా ఉండదని బౌరంపేట్ ఏఈ సాయికిరణ్ తెలిపారు.

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ లైన్ల ఎక్స్‌టెన్షన్ పనుల సందర్భంగా సరఫరాలో అవాంతరాలు తలెత్తనున్నాయని పేట్‌బషీరాబాద్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ మీనాక్షి ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 10:30 గంటల వరకు గ్రీన్ పార్కు, 11కేవీ జీడిమెట్ల ఫీడర్ పరిధిలో ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జీడిమెట్ల గ్రామం ప్రధాన రోడ్డు, భీమా ప్రైడ్, పిస్తా హౌస్, మెడోనె ఆసుపత్రి ప్రాంతాల్లో సరఫరా ఉండదు.

జీడిమెట్ల డివిజన్ ఎం.ఎన్.రెడ్డినగర్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు కాలనీ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ వైద్య శిబిరంలో ముందుగా వచ్చిన వంద మందికి ఉచిత పరీక్షలు చేయిస్తామన్నారు. థైరాయిడ్ ప్రొఫైల్, విటమిన్ డీ, బీ 12, బ్లడ్ ప్లెషర్, కంటి పరీక్షలను నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

కొంపల్లి సెక్షన్ పరిధిలో..

11కేవీ కొంపల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు సెంట్రల్ పార్క్, ఏఎంఆర్ లేన్, 11కేవీ దూలపల్లి సెక్షన్ పరిధిలో మధ్యాహ్నం 1 నుంచి 1:30 గంటల వరకు దూలపల్లి గ్రామం, అశోక ఏలా మాన్షన్, సెయింట్ మార్టిన్స్ కాలేజీ, 11కేవీ నూజివీడు ఫీడర్ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నూజివీడు సీడ్స్ కంపెనీ, గజానన్, విస్తారా, అశ్విని కాలనీ, గ్రీన్‌కౌంటీ ప్రాంతాల్లో సరఫరా ఉండదని కొంపల్లి సెక్షన్ ఏఈ తెలిపారు.

సుభాష్‌నగర్: కొత్త సర్వీస్ కనెక్షన్ జారీ సందర్భంగా గాజులరామారం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అవాంతరాలు ఏర్పడనున్నాయని ఏఈ చైతన్యభార్గవ్ తెలిపారు. 11కేవీ క్రషర్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1:30 నుంచి 2 గంటల వరకు కైసర్‌నగర్, సాబేర్‌నగర్, ఏఈహెచ్ఎస్ కాలనీ, లాల్‌సాబ్‌గూడ, 11కేవీ కైలాస్ హిల్స్ ఫీడర్ పరిధిలో మహదేవపురం, బాలయ్య బస్తీ ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

వైభవంగా పూజలు


బౌరంపేట్ ప్రణీత్ బ్లూమ్స్‌లో పూజల్లో పాల్గొన్న మహిళలు


నిజాంపేట్‌లో సాయిప్రియ కూచిపూడి డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో..


వెంకటేశ్వర కాలనీ గన్‌పార్కు వినాయక పూజల్లో..


చంద్రానగర్‌లో పూజల్లో చిన్నారులు

నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు మండపాల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు కొనసాగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలు మండపాల వద్ద గణేశ్ లడ్డూల వేలం పాట నిర్వహించి గణనాథులను నిమజ్జనాలకు తరలించారు. – కుత్బుల్లాపూర్


విజయనగర్ కాలనీలోని వినాయడి వద్ద అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న డీసీసీ మాజీ అధ్యక్షుడు కేఎం ప్రతాప్


సంజయ్‌పురి కాలనీలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు


సూరారం డివిజన్ పరిధిలో కూన రాఘవేంద్రగౌడ్ తదితరులు


షాపూర్‌నగర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో జీఎం అశోక్, డీజీఎం రాజేష్


గణేష్ ఉత్సవాల్లో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పార్మి ప్రకాష్‌గుప్తా


దూలపల్లిలో జరిగిన పూజలో బూర్గుబావి సత్యనారాయణ..